కథ

# స్వీట్ డేర్!

సామర్ల లక్ష్మీరాజ్.

మెల్లగా కళ్ళు విప్పిందామె... వేకువ జామున గులాబీ ఒక్కో రేకూ విచ్చుకుంటోన్నట్టుగా!

రాత్రి తాలూకు తన స్పర్శ... ఆ పరిమళం ఇంకా ఒంటినే అంటిపెట్టుకుని వుంటూ.. మధురిమల పులకరింతలతో తనువు తేలి మబ్బుల్లో తేలిపోతుంది.



అసలామెకు-

ఈ రోజేమిటో కొత్తగా... హాయిగా వుంది! చుట్టూ ఓసారి కలియచూసింది. రోజూ చూసే ఫర్నిచరే! ఆ ఫ్రిజ్, టీవీ, డెక్, అల్మరా క్రింద కార్పెట్, ఓ మూలగా ఒదిగి పోయిన ఇండోర్ ప్లాంట్స్ అన్నీ కొత్త అందాల్ని సంతరించుకున్నట్టుగా వున్నాయ్!

'ఈనాటితో తన జీవితమే మారబోతూంది' అనుక్కుంది. అందర్నీ కోల్పోయి ఒంటరిగా... వుద్యోగం చేస్తూ లైఫ్‌ని సాగిస్తోన్న తనకు- ...

ఎందరో... ఎందరెందరో...

ఎన్నెన్నో... ఆకర్షణలు...

ఎన్నో ఒత్తిళ్ళు! ఎన్నో రోజులుగా అందర్నీ కాదని, ఏంటో నిగ్రహంగా వున్న మనసు... మొదటిసారిగా బాలెన్స్ తప్పింది.

అతడు ఆఫీసుకు ట్రాన్స్‌ఫరై కొత్తగా జాయినయ్యాడు!

సూదంటి రాయిలా చురుక్కున గుచ్చుకునే ఆ చూపూ... మేన్లీగా డ్రెస్ చేసుకునే ఆ తీరూ... ముఖ్యంగా మొహంలో చెదరని చిరు నవ్వూ... నిజాయితీగా వ్యవహరించే స్వభావం... ఆమె మనసులో అతని రూపం మెల్లమెల్లగా ప్రతిష్ఠించుకు పోతూ... అనుక్షణం అతని ఆలోచనలతో ఉక్కిరి బిక్కిరి అవుతూ...

ఎన్నో నిద్రలేని రాత్రిళ్ళు...

రెప్పవాల్చని కళ్ళు!

అదిగో సరిగ్గా అప్పుడే... అతను ఆమెను డిన్నర్‌కు ఆహ్వానించాడు. ముందు బిడియపడ్తూ... ఆపై ప్రేమ మైకపు పొరల్లో సంశయాలన్నీ వీడుతూ... తొలిసారి ఓ పరపురుషుడితో హోటల్లో డిన్నర్‌కు వెళ్ళింది.

నియాన్‌లైట్ల కాంతి లాన్‌పై పడి అదో వింత రంగులు సృష్టిస్తోంటే...

ఎదురుగా అతని మాటలు మంత్రాల్లా మనసుపై ముద్రవేస్తోంటే...

సంధ్యచీకట్ల వెలుగుల్లో ఆ పాష్ వాతావరణం అదో ఆహ్లాదాన్ని కలిగిస్తోంటే... అతడు పెదవి విప్పాడు.

"మీ గురించి నాకు అంతా తెలుసు. చిన్నతనంలోనే ఓ ఆక్సిడెంట్లో మీ కన్న తల్లిదండ్రులను పోగొట్టుకున్నారు. ఒంటరిగా వుంటోన్నారు. ఆల్‌మోస్ట్ నా జీవితం కూడా మీలాంటిదే! నాకంటూ ఎవ్వరూలేని ఒంటరివాణ్ణి!! మేనమామ పెంపకంలో పెరిగి, చదివి, ఈ ఉద్యోగం సంపాయించాను. మీ స్వభావం, నడవడిక నాకు బాగా నచ్చాయ్! మీరొప్పుకుంటే మిమ్మల్ని వివాహం చేసుకోవాలని అనుకుంటోన్నాను! ఎస్! అయ్‌లైక్ యూ...! లవ్ యూ సో మచ్!" అంటూ చటుక్కున ఆమె అరచేతిని మృదువుగా నిమురుతూ సడెన్‌గా పెదవులకు ఆన్చి, ముద్దుపెట్టుకున్నాడు!

అంతే! ఒక్కసారిగా ఉలిక్కిపడిందామె! చెదిరిన మనసుని స్వాధీన పర్చుకుందామని ప్రయత్నించి విఫలు_

రాలైంది.

తొలిసారి పురుష స్పర్శ...

తనువంతా ప్రాకి గుండె జల్లు మనిపిస్తోంటే... మనసు ఇంద్ర ధనస్సే అయింది!!

అతని ప్రపోజల్ ఆమెకు బాగా నచ్చింది. అవునుమరి! స్త్రీ సహజంగా కోరుకునే మాంగల్యం- అదీ నచ్చినవాడితో వైవాహిక జీవితం... కలగా అన్పిస్తోంటే...

ఇంటికెలా చేరిందో తెలీదు! అదిగో అప్పట్నుండే మనసులో, శరీరంలో... చుట్టూ పరిసరాలలో... ఏనాడూలేని కొత్తదనం!...




కన్పిస్తోంది.

◆◆◆

సిల్కీ హెయిర్‌ని గాలికి వదిలేస్తో... మార్బుల్ షిఫాన్ ప్లెయిన్ శారీ, గుజరాతీ చోళీలో...

కళ్ళకు అద్దిన కాటుక రేఖలు, నుదుటన మెరుస్తోన్న ఎర్రని తిలకం...

ముగ్ధమోహనంగా; అందంగా అద్భుతంగా ఆఫీసుకు వచ్చింది! ఆమె కళ్ళు అతని కోసం అటూ యిటూ వెదికిస్తో...

కనిపించక నిరాశపడుతూ.... ఇంకా రాలేదనుకుంటూ అని మనసుకి సర్దిచెప్పుకుంటూ...

చాలా క్యాజువల్‌గా అతని డెస్క్ దగ్గరకు నడిచింది.

చిందర వందరగా వుంది టేబుల్! డెస్క్‌లో క్లాత్ వుందేమో క్లీన్ చేద్దామను కుంటూ డ్రాయర్ సొరుగు లాగేసరికి ఏదో లెటర్ కనిపించింది! ఆమెలో ఏదో కుతూహలం! తనకు తెలియకుండా అతనికి ఉత్తరాలు వ్రాసేదెవరా- అన్న క్యూరియాసిటీతో దాన్ని తీసుకుంది! ఇంకా ఓపెన్ చేసినట్టు లేదు! చొరవగా ఆమె ఆ ఉత్తరాన్ని తెరిచి చదవసాగింది!

◆◆◆

ఆ సాయంత్రం-

ఆమె రాక కోసం అతను బీచ్ ఒడ్డున ఎదురు చూస్తోన్నాడు!

ఆమె ఎంతకీ రాదు!

చుట్టూ చీకట్లు ముసురుకుని లైట్లు వెలుగుతోన్నాయ్!

అతనికి అసహనంగా వుంది.

అంతకంటే ఆత్రంగా కూడా వుంది!

ఎలా అయినా సరే! ఆమెని ఒప్పించి తనదాన్ని చేసుకోవాలన్న తొందర అతన్లో...

ఆమె మనసుని గెలుచుకున్నాడు!

ఇక ఆమెనే...?

ఇంతలో దూరంగా ఆమె వస్తోన్నట్టుగా ఆనవాలు...

దగ్గరవుతోన్న అడుగుల చప్పుడు... ఆమెవచ్చీరాగానే అతను-

"అబ్బ! ఏమిటోయ్ అంత లేటు! ఎంత సేపట్నుండి వెయిట్ చేస్తున్నానో తెలుసా నీ కోసం...?! ఇంతకీ మన పెళ్ళి సంగతి ఏం చేసావో చెప్పలేదు!? ఆ గుడ్ న్యూస్ విందామని ఎంత తపనపడుతున్నానో తెలుసా?!" ఆ మాటలింకా పూర్తికానే లేదు.

"స్టాపిట్ అయ్‌సే! యూ ఛీట్! నమ్మించి మోసగించాలనుకున్న మగాడివి నువ్వు! ఛీ!ఛీ! నీ బండారం బయటపడింది రాస్కెల్! నీకసలు ఎవరూ లేరన్నావ్ కట్టుకున్న భార్యా, కన్న కొడుకూ వుండగా!? కట్నం తేలేదని ఆమెని వదిలేసావ్?! ఇప్పుడు నావెంట పడ్డావ్?!

నీలాంటి బ్రూట్‌ని నమ్మినందుకు నన్ను నేనే శిక్షించుకోవాలి. మంచివాడిగా నటించి నన్ను వంచించబోయావ్?! నా అదృష్టం బావుండి నీ భార్య వ్రాసిన వుత్తరం నాకంటపడింది!

ఏదో తోడుగా కడగంటా వుంటావని నిన్ను నా జీవితంలోకే ఆహ్వానిద్దామనుకున్నాను! కలలెన్నో కన్నాను! ఇంకానయం! నా జీవితం సర్వనాశనం కాకముందే కళ్ళు తెరిచాను! నీలాంటి తోడేళ్ళని నమ్మటం నాదే బుద్ధి తక్కువ!

లుక్! మానవత్వమున్న మనిషివైతే నీ భార్యాబిడ్డని తెచ్చుకో! ఇంకే ఆడపిల్ల జోలికీ వెళ్ళకు!! గుడ్ బై!!" ఆమె రౌద్రమూర్తే అయింది! తెప్పరిల్లి తేరుకునే లోపలే ఆమె కోపంతో, విసురుగా వెళ్ళిపోయింది.

చెప్పుచ్చుకు కొట్టకుండానే చెప్పుకొచ్చిన ఆమెను దిగ్భ్రమగా చూస్తూండి పోయాడు అతను.

తన సంగతి తెలిసిపోయిందన్న బాధ కన్నా...

చిత్రంగా ఓ అవకాశం కోల్పోయినందుకు విచారిస్తూ వెనుదిరిగాడు అతను!!

★ ★ ★